క్లుప్తంగా

రేపటి లోగా అద్దె చెల్లించండి

ఎంపీడీఓ రాజ్ మల్లయ్య

మర్పల్లి: మడిగె అద్దె బకాయిలను రేపటి లోగా చెల్లించాలని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య వ్యాపారులకు సూచించారు. సోమవారం ఆయన జిల్లా పరిషత్ నిధులతో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన దుకాణ సముదాయాన్ని (9 మడిగెలు)ఆయన సందర్శించి మాట్లాడారు. సముదాయంలో ఉన్న తొమ్మిది దుకాణాలను ఒక్కోదానికి నెలకు రూ.3,500 చొప్పున వ్యాపారులకు అద్దెకు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కానీ కొంతకాలంగా నిర్వాహకులు కిరాయి చెల్లించడం లేదని తెలిపారు. అద్దె రుసుమును ఈ నెల 14వ తేదీ లోగా చెల్లించాలని, లేని యెడలా.. ఎంపీపీ, వైస్ ఎంపీపీ, పాలకవర్గం ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సోయెల్, సూపరింటెండెంట్ కృష్ణరావు, ఏంపీఓ సుశీల్ కుమార్, జూనియర్ సహాయకుడు మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ ఉన్నారు.

చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయొద్దు



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న ప్రత్యేక అధికారి చాంద్‌పాష

తాండూరు రూరల్: చెత్తను బహిరంగ ప్రదేశాల్లో వేయరాదని, మీ ఇంటి ముందరకు వచ్చే గ్రామ పంచాయతీ ట్రాక్టర్లో వేయాలని ప్రత్యేక అధికారి చాంద్ పాష అన్నారు. మండల పరిధి మిట్టబాసుపల్లిలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం ఆయన గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా, నివారణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కరుణాకర్‌రెడ్డి ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



తిరుపతిరెడ్డిని కలిసిన అమృతప్ప

యాలాల: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ మండల బీసీసెల్ అధ్యక్షుడు కోర్వని అమృతప్ప తిరుపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో పార్టీ బలంగా ఉందని, రానున్న ఎన్నికల్లో ఇదే ఒరవడిని కొనసాగించాలని సూచించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ తదితరులు

ధారూరు: మండల పరిధి స్టేషన్‌ధారూరులో సోమవారం ఎంపీపీ జె. విజయలక్ష్మి.. వాలిబాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పట్లోళ్ల బసప్పలతో కలిసి సీసీరోడ్డు పనులకు ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మండల పరిధి గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణాలకు నిధులు వచ్చాయని తెలిపారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించవద్దని నిర్మాణ దారులకు సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి, ఎంపీఓ షఫీఉల్లా ఉన్నారు.

అర్హులందరికీ గ్యారంటీలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

దోమ: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని మాజీ సర్పంచ్ కోళ్ల సురేశ్, అంతిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి బొంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ట్రాన్స్‌కో సిబ్బందితో కలిసి, ఉచిత విద్యుత్‌కు అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే గ్యారంటీల్లో ఇప్పటికే రెండు పథకాలు అమలు అవుతున్నాయని, ఉచిత విద్యుత్ అందించేందుకు కార్యాచరణ మొదలు పెట్టిందని చెప్పారు. చంద్రశేఖర్, రాములు, మల్లారెడ్డి, భాస్కర్, బషీర్, రమేశ్, బాలరాజ్, ప్రభాకర్, అశోక్, హన్మయ్య పాల్గొన్నారు.



బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు

ఘనంగా మల్లన్న జాతర

వైభవంగా శివ పార్వతుల కల్యాణం

పెద్దేముల్: మల్లికార్జున స్వామి జాతర వైభవంగా జరిగింది. సోమవారం మండల పరిధి గోట్లపల్లి మల్లికార్జున ఆలయంలో శివ పార్వతుల కల్యాణంతో పాటు.. బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. సుమారు పదహారేళ్లుగా కొనసాగుతున్న ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 10 నుంచి జాతర కొనసాగగా.. చివరి రోజు సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని ఆలయ ధర్మకర్త మల్లప్ప స్వామి దంపతులచే ఘనంగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా స్వామివారికి గ్రామస్తులు బోనమెత్తారు. డప్పు చప్పుళ్ల నడుమ, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో భక్తజనం స్వామివారి సన్నిధికి ఊరేగింపుగా తరలి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి, మొక్కలు చెల్లించుకున్నారు. పాడిపంటలతో పల్లెలు పచ్చగా కళకళలాడాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండేలా దీవించు స్వామి అంటూ వేడుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.



శివపార్వతులకు తలంబ్రాలు పోస్తున్న భక్తులు

అసౌకర్యాల ఆర్టీసీ బస్టాండ్

- ముప్పై ఏళ్లయినా.. వీడని నిర్లక్ష్యం
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని సంస్థ అధికారులు

నవాబుపేట: నిత్యం ప్రయాణికులతో కళకళలాడే ఆర్టీసీ బస్టాండ్.. కనీస సౌకర్యాల లేమితో కొట్టుమిట్టాడుతోంది. ఫలితంగా ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఇతర సౌకర్యాల సంగతి ఎలా ఉన్నా.. ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలు కూడా, నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయంటే అధికారుల నిర్లక్ష్యం ఏమేరకు ఉందో తెలుస్తోంది.

మూడు దశాబ్దాలుగా..

నవాబుపేట మండల కేంద్రంలో 30 ఏళ్ల కిందట సుమారు నాలుగు ఎకరాల స్థలంలో నాటి ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ బస్టాండును నిర్మించింది. దుకాణ మడిగెలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేసింది. కానీ తాగు, ఇతర అవసరాలకు నీటి సౌకర్యం కల్పించలేదు. దీంతో అవి క్రమంగా వినియోగానికి దూరమయ్యాయి. నీటి కొరత, నిర్వహణ లోపంతో వాటి నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతుండటంతో ఉపయోగించుకునేందుకు ప్రయాణికులు అయిష్టత చూపుతున్నారు. ఫలితంగా అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్టాళ్లను అద్దెకు తీసుకోవడానికి వ్యాపారులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఫలితంగా అవీ మూతపడ్డాయి. కరెంటు లేని కారణంగా చీకటి పడిన తరువాత.. ఆ ప్రయాణప్రాంగణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడం సహజంగా మారిందని స్థానికులు చెప్పడం గమనార్హం.



నవాబుపేట బస్టాండు (ఇన్‌సెట్లో) నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

నిత్యం 7వేలకు పైగా ప్రయాణికులు

మండల కేంద్రం మీదుగా వికారాబాద్ నుంచి శంకర్‌పల్లి, శంకర్‌పల్లి నుంచి వికారాబాద్ వరకు నిత్యం 7 బస్సులు 35 ట్రిప్పులు తిరుగుతుండగా.. వాటిల్లో 7వేలకు పైగా ప్రయాణికులు వారివారి గమ్యస్థానాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అయినా ఆర్టీసీ అధికారులు బస్టాండులో వసతులు, ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంతో విఫలమయ్యారని పలువురు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. సంస్థ ఉన్నతాధికారులు స్పందించి, సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

నవాబుపేట బస్టాండులో ప్రయాణికుల సౌకర్యార్థం ఎలాంటి వసతులు లేవు. విద్యుత్, నీటి సౌకర్యం కల్పించేందుకు సుమారు రూ.4 లక్షల వరకు నిధులు అవసరం అవుతాయి. అందుకోసం ఉన్నతాధికారులకు ప్రపోజల్స్ పంపాము. అనుమతులు రాగానే సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు ఎవరైనా ముందుకు వస్తే, స్టాళ్లను అద్దెకు ఇస్తాం.

-లక్ష్మీనాయక్, డీఎం, వికారాబాద్

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కొడంగల్ రూరల్: జాయింట్ ప్లాట్ ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ, ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మిషన్ భగీరథ కార్యాలయంలో ఏఈ సుధాకర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న చేపట్టనున్న సమ్మెలో పాల్గొననున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులను కనీస వేతనం రూ.26వేలకు పెంచుతూ.. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్రం పట్టించుకోవడం లేదని, కార్మికులు, కర్షకులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. కార్యక్రమంలో భగీరథ కార్మికులు రాజు, మోహన్, సాయిలు, గోపాల్, కిషన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



మిషన్ భగీరథ ఏఈ సుధాకర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో డాక్టర్ ముత్తారెడ్డి తదితరులు

అనంతగిరి: సైన్స్‌పై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ ముత్తారెడ్డి సూచించారు. నేషనల్ సైన్స్ డేను పురస్కరించుకుని సోమవారం వికారాబాద్‌లోని సంకల్ప విద్యాపీఠం పాఠశాలలో టీఎస్ కాస్ట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. విషయం ఏదైనా నిశిత పరిశీలన, ఏకాగ్రత పెడితే సాధించలేనిదంటూ ఏదీ ఉండదని చెప్పారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ దోమ కమాల్‌రెడ్డి, వీరకాంతం, అంజిరెడ్డి, దివాకర శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

‘కొండా’ ప్రచారం షురూ

ధారూరు: లోకసభ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ సీనియర్ నాయకుడు, చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తన ప్రచారాన్ని మొదలు పెట్టారు. పార్టీ అధిష్టానం నుంచి అభ్యర్థి ఎవరనేది అధికారికంగా ఎటువంటి ప్రకటన వెలువడక పోయినప్పటికీ.. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేయనున్నట్లు వాల్‌పోస్టర్ల ద్వారా కొండా స్పష్టం చేస్తున్నారు. కొండా ఫొటోతో పాటు, ప్రధాని నరేంద్ర మోదీ చిత్రంతో కూడిన గోడ ప్రతులు.. ఉమ్మడి జిల్లాలో గోడలపై, విద్యుత్ స్తంభాలకు, ప్రధాన కూడళ్లలో దర్శనమిస్తుండటంతో జిల్లాలో చర్చనీయాంగా మారింది.



విద్యుత్ స్తంభానికి అతికించిన వాల్‌పోస్టర్

యూరియా వచ్చేసింది

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: ‘ఎరువు కరువు’ శీర్షికన సోమవారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి వ్యవసాయ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఎరువుల దుకాణానికి 20 టన్నుల యూరియాను పంపిణీ చేశారు. దీంతో అన్నదాతలు ఆనందం వ్యక్తంచేశారు. పది రోజులుగా యూరియా కోసం ఎదురు చూశామని, ఆలస్యమైనా తమ సమస్య తీరిందని రైతులు తెలిపారు.

అన్ని రంగాల్లో రాణించాలి

పూడూరు: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తైక్వాండో జిల్లా కార్యదర్శి గోపాలకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని కేశవరెడ్డి స్కూల్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి తైక్వాండో పోటీలు ప్రారంభించారు. ఈ టోర్నీలో సుమారు 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడారు. కరాటే శరీర దృఢత్వానికి, ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ అలవర్చుకుంటే.. ఎంచుకున్న లక్ష్యాలను సాధించి, ఉన్నత స్థాయికి ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు అమరేందర్‌రెడ్డి, ఎన్కేపల్లి మాజీ సర్పంచ్ దయాకర్, శివరాజుగౌడ్, పలువురు కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



మహేందర్‌రెడ్డిని కలిసిన విశ్వనాథ్‌గౌడ్

మీతో పాటే మేము..

తాండూరు: మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నంతో పాటు కాంగ్రెస్‌లో చేరేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధమవుతున్నారు. అందులో భాగంగా సోమవారం పట్నం మహేందర్‌రెడ్డి దంపతులను మున్సిపల్ మాజీ చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా.. విశ్వనాథ్‌గౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌ను వీడి, మీతో పాటే కాంగ్రెస్ పార్టీలో చేరతానని ఎమ్మెల్సీకి చెప్పారు.

కుంట.. కంటతడి!

- చెరువులో కలుస్తున్న వ్యర్థ జలాలు
- పగుళ్లు ఏర్పడిన కట్ట
- ఆక్రమణలతో తగ్గిన విస్తీర్ణం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని కాశన్నకుంట చెరువుకు ఏళ్ల నుంచి మరమ్మతులు కరువయ్యాయి. ప్రస్తుతం చెరువు కట్టకు పగుళ్లు రావడంతో పూర్తిస్థాయిలో చెరువు నిండితే కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది. దీనికి తోడు చెరువులోకి ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చేందుకు ప్రకృతి సహజ సిద్ధంగా ఏర్పడిన పాటు కాల్వలు ధ్వంసం కావడంతో భారీ వర్షాలు కురిసినా చెరువులోకి వరద రావడం లేదు. కొందరు రియల్టర్లు, పరిశ్రమల నిర్వాహకులు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కబ్జాలు, ఆక్రమణలకు పాల్పడుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు లేని కారణంగా కంపచెట్లు, పూడికతో నిండుకోవడం వలన చెరువు విస్తీర్ణం, నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఉనికిని కోల్పోతుంది.

చెరువులోకి పరిశ్రమల వ్యర్థ జలాలు

రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 32 ఎకరాల్లో కాశన్నకుంట చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు కింద ఒకప్పుడు 30 ఎకరాల ఆయకట్టు ఉండేది. వర్షాకాలంలో ఈ చెరువు నిండితే వ్యవసాయ బోర్లే కాకుండా గ్రామానికి తాగునీటిని సరఫరా చేసే బోర్లలోనూ నీటిమట్టం పెరిగేది. తద్వారా వేసవిలోనూ నీటి ఇబ్బందులు ఉండేవి కావు. స్థానిక మత్స్యకారులు ఏటా లక్షలు వెచ్చించి చేపల పెంపకం చేపడుతున్నారు. కాగా మండల కేంద్రంలో పారిశ్రామిక వాడ ఏర్పాటైన తర్వాత క్రమేణ కొన్ని పరిశ్రమలు వ్యర్థ జలాలను.. వర్షాకాలంలో వరద నీటితో పాటు చెరువులోకి వదిలేశారు. దీంతో ఈ చెరువులోని నీరంతా కలుషితమైంది. ప్రస్తుతం ఈ నీటిని పశువులు సైతం తాగడం లేదు,

కబ్జా కోరల్లో కుంట

కాశన్నకుంట చెరువుకు చుట్టూ పరిశ్రమలు, రియల్ వెంచర్లు ఏర్పాటవుతున్నాయి. ఇదే అదునుగా భావిస్తున్న కొందరు అధికారులు, స్థానిక నాయకులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా శిఖం పొలాన్ని కబ్జాలు, ఆక్రమిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా చెరువు సమీపంలో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ వర్షాకాలంలో చెరువు నీటితో నిండుకుంటుందంటే అధికారుల పనితీరు ఇట్టే అర్థమవుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




కాలుష్యంతో రంగు మారిన కాశన్నకుంట జలాలు (ఇన్‌సెట్‌లో) ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్

పట్టించుకోని అధికారులు

నిబంధనల ప్రకారం.. చెరువు ఎఫ్‌టీఎల్ లెవల్ (నీటి పరివాహక ప్రాంతం) పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఇక్కడ ఏర్పాటు చేసిన వెంచర్ చెరువు నీటితోనే నిండుకుంటుంది. ఇక పలువురు వ్యాపారులు యథేచ్ఛగా చెరువు శిఖంను ఆక్రమించారు. ఈ విషయాలను ఎప్పటికప్పుడు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చినా.. వారు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.


మరమ్మతులు చేపట్టాలి



కాశన్నకుంట చెరువుకు మిషన్‌కాకతీయ పథకంలో భాగంగా మరమ్మతులు చేపట్టాలి. అప్పుడే కబ్జాలు, ఆక్రమణలు చేసిన వైనం బయటపడుతుంది. కొన్నేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో చెరువు మట్టి, కంప చెట్లతో నిండుకుంది.

– యాదగిరి, మత్స్యకార సంఘం సభ్యుడు, కొత్తూరు

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



కాశన్నకుంట చెరువును పరిశీలించి చెరువు పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం. చెరువు శిఖంలో ఎలాంటి కట్టడాలు చేపట్టరాదు. చెరువులోకి కలుషిత నీటిని వదిలినట్లు తెలిస్తే.. చర్యలు తప్పవు.

– రవీందర్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈ, కొత్తూరు.

శివపార్వతుల కల్యాణోత్సవం

కొడంగల్ రూరల్: మండల పరిధి పెద్దనందిగామ గ్రామంలో శ్రీనాగలింగేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు, రామాంజనేయ భజన మండలి సభ్యులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అనంతరం ఆలయంలో కల్యాణం జరిపించారు. వేడుకలో పాల్గొన్న భక్తులకు.. గ్రామానికి చెందిన శివకుమార్, తాండూరుకు చెందిన అర్జున్‌రెడ్డిలు అన్నదానం చేశారు.



దేవతామూర్తుల విగ్రహాలను ఆలయానికి తీసుకువస్తున్న భక్తులు

అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి

మర్పల్లి: గ్రామంలో అంతర్గత రోడ్ల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఈశ్వర్ అన్నారు. సోమవారం మండల పరిధి గుండ్ల మర్పల్లి గ్రామంలో ఊరడమ్మ దేవాలయం నుంచి బక్కారెడ్డి ఇంటి వరకు, కుమ్మరి బక్కయ్య ఇంటి నుంచి గంగరాజు ఇంటి వరకు ఫార్మేషన్ రోడ్డు పనులను జీపీ కార్యదర్శి వాణీశ్రీతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ హామీ మేరకు గ్రామాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఉపాధిహామీ పథకం కింద ఫార్మేషన్, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.8 లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ మేరకు పనులు ప్రారంభించినట్లు వెల్లడించారు.



ధారూరు మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కుర్వ చంద్రయ్య, మాజీ వార్డు సభ్యులను సోమవారం కాంగ్రెస్ నాయకులు ప్రకాశ్, కాశీరాం తదితరులు సన్మానించారు - ధారూరు

సీసీరోడ్ల నిర్మాణానికి రూ.2.50 కోట్లు

ధారూరు: జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.2.50 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటితో మండల పరిధి గ్రామాల్లో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ చెన్నారెడ్డి సోమవారం తెలిపారు. మండలానికి మొత్తం 48 సీసీరోడ్లు మంజూరు అయ్యాయని, వీటిని ఈ నెల 15వ తేదీ వరకు నిర్మించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. మండల కేంద్రానికి రూ.10 లక్షలు, లక్ష్మీనగర్‌తండా, తిమ్మానగర్, చింతకుంట, హరిదాస్‌పల్లి, ఎబ్బనూర్, కేరెళ్లి, బాచారం, నాగ్‌సాన్‌పల్లి, మైలారం, అల్లిపూర్, కొండాపూర్‌కలాన్, నర్సాపూర్, గడ్డమీది గంగారం, అవుసుపల్లి, అల్లిపూర్, రుద్రారం, కుమ్మర్‌పల్లితండా, ధర్మాపూర్, పీసీఎం తండా, అంపల్లి, గురుదోట్ల, రాజాపూర్, మోమిన్ ఖుర్దు, అంతారం గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరైనట్లు ఆయన వివరించారు. అలాగే నాగారం, మోమిన్‌కలాన్, దోర్నాల్, స్టేషన్‌ధారూరు, రాంపూర్‌తండా, గట్టెపల్లి, నాగసముందర్, కుక్కింద, మున్నూరుసోమారం, తరిగొప్పుల, కొండాపూర్‌ఖుర్దు గ్రామాలకు రూ.10 లక్షల చొప్పున మంజూరు అయ్యాయని, పలు గ్రామాల్లో పనులు ప్రారంభం అయ్యాయని, కొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన వెల్లడించారు.